విశ్వ నిర్వేదంగా నవ్వాడో అలా అభినయించాడో కృషికి అర్థం కాలేదు. “నేను బాధపడుతున్నది జరిగిందానికి కాదు ఉపాధ్యాయగారూ. ఇక ముందు జరగబోయేదాని గురించి. . . మీ అభిమానాన్ని పొందగలిగిన ఒక అనాథ యువకుడిపై కక్షతో పోరాటం ప్రారంభించిన వాళ్ళు రేపు మరేం చేస్తారో అన్నది వూహించలేక పోతున్నాను.”

లాలనగా విశ్వని పేట్ చేశారు ఉపాధ్యాయ . . . విశ్వ చెప్పిన దాంట్లో తనో అనాథ అన్న పదం ఎక్కువగా ఆయన్ని కదిలించినట్టుగా “నేనుండగా నువ్వు అనాథవి కావు విశ్వ” అన్నారు గంభీరంగా.

అది విశ్వ నటనలో గొప్పతనమో లేక నిజాన్ని గుర్తించలేని తాతయ్య అమాయకత్వమో కృషికి తోచడం లేదు. కాని విశ్వ చాలా అమోఘంగా ఆకట్టుకుంటున్నాడు.

ఆ తర్వాత ఫ్యాక్టరీకి బయలుదేరుతున్న ఉపాధ్యాయని వారించబోయాడు విశ్వ “ఈ వయసులో సైతం మీ దీక్ష, దక్షత కొనియాడ తగినవే! కాని మీ ఆదేశాల్ని పాటించడానికి నాలాంటి వాళ్ళుండగా మీరింకా శ్రమపడటం నాకు సమంజసంగా అనిపించడం లేదు”

మృదువుగా నవ్వారాయన. . . “నా శరీరంలో శక్తి ఇంకా ఉడిగిపోలేదు విశ్వనాథ్” అంతకు మించి మాట్లాడకుండా డాక్టర్ మహంతితో బాటు బయటికి వెళ్ళిపోయారు.

విశ్వ నిజాయితీపైనా సమర్థతపైనా అసాధారణమైన నమ్మకం ఏర్పడిపోయిన ఉపాధ్యాయ కారెక్కుతూ డాక్టర్ మహంతితో ఏం చెప్పిందీ కృషికి తెలీదు.

కాని ఉపాధ్యాయని పూర్తిగా నమ్మించగలిగిన విశ్వతో అంది ఉక్రోషంగా “అభినందిస్తున్నాను విశ్వా. . . నీ నటనా కౌశల్యానికి ఆశ్చర్యపోతున్నాను”

“అప్పుడే ఏం చూసేవు కృషి ఇది ప్రారంభం మాత్రమే”

“నన్ను కూడా తక్కువగా అంచనా వేయకు”

“అలా చేసేవాడ్ని అయితే అక్కడ పోలీస్ స్టేషన్లో చౌదరి మనిషి సరెండర్ అయ్యేట్టు ఆర్గనైజ్ చేసేవాడ్ని కాదు కృషి ”

అదిరిపడింది కృషి “వాట్”

“ఎస్ మిస్ కృషి” విజయగర్వంతో నవ్వాడు విశ్వ. “నాకు తెలుసు నువ్విలాంటి పరిశోధన ప్రారంభిస్తావని. . . అందుకే చౌదరితో మాట్లాడాను. ఓ మనిషిని ఏర్పాటు చేశాను. . .పాపం. . .ఏసిపి మాథుర్ వచ్చేసరికి చెస్లో నాకు చెక్ చెప్పేసినట్టు తెగ సంబరపడిపోయావు కదూ. . .కాని . . . పదివేలు మొహాన పడేస్తే నేరం ఒప్పుకుని జైల్లో కూర్చునే వ్యక్తులు ఈ దేశంలో చాలా మంది వుంటారని తెలుసుకోలేకపోయావు...”

కృషికి ముచ్చెమటలు పోసాయి. . . ప్రతి యెత్తుకి పై యెత్తు వేసి చాల అలజడి సృష్టిస్తున్నాడు విశ్వ.

“దేనికోసం ఇదంతా”

“నీ మీద గెలుపుకోసం”

“అంటే. . ..”

“నువ్వెంత వున్నదానివైనా నాకింద వుండాల్సిన దానివే అని నీకు నిరూపించడం కోసం”

“అదంత సులభం కాదు విశ్శు . . . .”

“సులభమే అయితే యిన్ని పథకాలెందుకు కృషి ఎప్పుడో కానిచ్చేసేవాడ్నిగా” క్షణం ఆగి అన్నాడు “అంచెలంచెలుగా ఎదిగిపోతున్న నన్ను చూస్తుంటే ఇప్పుడేమని పిస్తూంది”

“నువ్వు వచ్చింది కేవలం నాకోసం మాత్రమే కాదని అర్థమైపోయింది విశ్శూ. . . ఇప్పుడు అసలు పరిశోధన ప్రారంభించాలని వుంది”

ఎగతాళిగా నవ్వేడు విశ్శు. . .

“ఒకనాడు నేను నీ తల్లిని కిడ్నాప్ చేయించావన్నావుగా. . .”

“అయితే”

“ఇప్పుడు ఆవిడ్ని నిజంగా కలుసుకోబోతున్నాను. . . ”

“నువ్వో అనాధవని యిందాక మా గ్రాండ్‌ఫాదర్‌తో అన్నావుగా”

విశ్శు మొహంలో రంగులు మారాయి.

“నువ్వు చెప్పింది నిజం కాదని మా తాతయ్యకి త్వరలోనే తెలియచెప్ప బోతున్నాను. నిన్నీ యింటి నుంచి బయటికి సాగనంపబోతున్నాను”

కృషి వెంటనే ఆ పనిలో నిమగ్నమయ్యేదే కాని ఫ్యాక్టరీ నుంచి అర్జెంటుగా రమ్మని ఉపాధ్యాయగారు ఫోన్ చేశారు. . . ఇప్పుడిప్పుడే కొన్ని కీలకమైన నిర్ణయాలలో కృషిని ఇన్వాల్వ్ చేస్తున్న ఉపాధ్యాయ గారు పిలిచింది తన ఛాంబర్‌లో జరిగే ఓ ముఖ్యమైన సమావేశంలో పార్టిసిపేట్ చేయమని. . .

అది ఉపాధ్యాయ తన మెషిన్‌టూల్ ఫ్యాక్టరీకి సంబంధించి పంపబోయే టెండర్ గురించి.

చౌదరి నిన్న దేవిని ఏకాంత సేవలో అడిగింది ఆ టెండర్ గురించే. . .

కృషి రోజంతా అ పనిలోనే బిజీగా వుంది.

0 0 0

రాత్రి పది గంటలు కావస్తుండగా జూబిలీ హిల్స్‌లోని గీతాదేవి బిల్డింగ్‌లో అడుగుపెట్టాడు విశ్శు.

నిజానికి వెళ్ళడం ఇష్టం లేదు కాని ఓ ముఖ్య సమాచారం తెలుసుకోవాల్సి వుంది కాబట్టి వెళ్ళక తప్పదన్నాడు చౌదరి.

ఖరీదైన భవంతిలోని హాల్లో అడుగు పెట్టగానే ఓ స్వాగతంలా పది మంది అమ్మాయిలు ఎదురొచ్చారు. . . లోలోన చాలా కంగారుపడ్డాడు. అక్కడ జరిగే కార్యక్రమం గురించి చౌదరి కొద్దిగా హింట్ చేశాడు. కాని ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే కొత్తల్లుడు తొలిసారిగా అత్తగారింట అడుగుపెట్టినప్పటి ఏర్పాట్లలా అనిపించింది.

తెలియజేసింది. ఆమె వెనుకగా మెట్లెక్కి ఓ గది దాకా వచ్చాడు. . .ఆ తర్వాత లోపలికి వెళ్ళమన్నట్టు సంజ్ఞ చేసి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

లోపల అడుగుపెట్టగానే మల్లెల గుబాళింపు .... ఎదురుగా శోభనపు మంచంలా అలంకరించబడిన బెడ్. . . ముచ్చెమటలు పోస్తుంటే ముందుకు నడిచాడు. . . . దేవాలయం మీద బూతుబొమ్మల్లా గోడల నిండా శృంగారానికి సంబంధించిన చిత్రాలున్నాయి. . .చౌదరి పంపింది ఒకందుకైతే వచ్చింది మరెందుకో అన్నట్టు అక్కడి వాతావరణం ఆందోళన పుట్టిస్తుంటే ద్వారం గడియపెట్టిన చప్పుడు వినిపించింది.

గభాలున వెనక్కి తిరిగిన విశ్శు రెండు నిముషాల దాకా చూపు మరల్చుకోలేకపోయాడు.

పరిమళపు ప్రభంజనంలా, స్వప్న రంభాపరీరంభపు కైపుతో వినీల శిరోజ తమస్సముద్రంలో ఉద్భవించిన నందివర్ధనంలా నడిచి వస్తూంది దేవి. కళ్ళతో కాంక్షల మేలుచాందినీలు. . .పరతెంచే పుష్పపరాగం. . . కాలాన్ని స్తంభింపచేసి ‘గిరులకీ జరులకీ అర్థం నేనే’ అన్న అహాన్ని ప్రదర్శించే అదిరే ఆనందపు నెలవంకల అధరాల సవ్వడి. . .

“మిమ్మల్ని మెచ్చాం భక్తా” గళాన సౌందర్య మధూళిని చిందిస్తూ నవ్వింది దేవి... అతడు నివ్వెరపోయి చూస్తుండగానే ఆమె శరీరంపై ఉన్న ఉల్లి పొరలాంటి చీర నేల జారింది.

ఆమె ఒంపుల్లో ఇంద్రధనస్సులూ, అదృశ్యస్వర్గాలూ అశ్రుతగాంధర్వాలూ యిప్పుడు బహిర్గతమై మొగలిపొదలో పడగవిప్పి ఆడ త్రాచును గుర్తు చేస్తున్నాయి.

ఏకాంత సేవలో ఆనవాయితీగా వుండే స్నానం గురించి ఆమె విస్మరించింది. ఇప్పుడు అలాంటి ఆలస్యం సైతం ఆమెకు భరింపశక్యం కానట్టు “రా. . . మాలో ఐక్యంకా. . . ” అంది మగతగా.

చెమట్లు పట్టేయి విశ్శుకి.

“నిన్నే భక్తా. . .జ్ఞానాకారమిదం సర్వం. . .ఇప్పుడు మాలో ఐక్యం కావడమూ జ్ఞానమే - రా” విరహంతో కాగిపోతూందామె.

“నేను. . . . బ . . .బ్రహ్మచారిని. . .” అదో అనర్హతలా వ్యక్తం చేశాడు కంగారుగా.

“మాకు మరింత ఆసక్తికరమైన విషయం” అతడి ముందుకు వచ్చి బాట చూపుతున్నట్టు నేలపై పడుకుంది.

“ఇంతవరకూ నాకు అలవాటు లేదు” ఉన్న వాస్తవం చెప్పేశాడు “అందుకే చేతకాదంటున్నా.”

“పిచ్చి భక్తా. . .” గొణిగింది స్వగతంలా “కర్మజ్యాయోహ్య కర్మణః అని వినలేదా”

“ఇదే తొలిసారి వినడం. . .” ఏ ఆడదైనా ఆఖరికి వేశ్యయినా గాని ఈ రేంజ్ ఉన్మాదం ప్రకటించగలదని అతడకి తెలీదు. . . ఇప్పుడెలా తప్పించుకోవడం. . . సీరియస్‌గా అన్నాడు. “మీ బాధ అసలు అర్థం కావడం లేదు”

నిర్వహించకపోవడం కన్నా కర్మని నిర్వహించడమే మిన్న అన్నది అర్యోక్తి. . . ఉపదేశించటానికి మేం సిద్ధంగా వున్నాం. . .ముందు మానసికంగా సిద్ధంకా. . .”

“అది కాదు మేడమ్. . .”

ఆమె కళ్ళు అరుణిమని పుంజుకున్నాయి. . .చూపు మాత్రంగానే మగాళ్ళని శాసించి పాదాక్రాంతం చేసుకోగల ఆమె శక్తి ఇక్కడ విఫలమవుతున్నట్టు కోపంతో ఆమె కంపించిపోతుంది “మయి బుద్ధిం నివేశయ. . . .”

“ఇదీ నాకు అర్థం కాలేదు”

“మాలో బుద్ధిని మనసుని నిలుపుకొమ్మని ఆదేశిస్తున్నాను.”

“నిలుపుకోవడం కష్టంగా వుంది”

”ఏకాగ్రతగా ప్రయత్నించు”

“ప్రయత్నించడానికి నాకు అభ్యంతరం లేదు”

“మరి ఏమిటి నీ సమస్య .. . . ” ఉక్రోషంగా అడిగింది.

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్” విభ్రమంగా చూసింది “ఏమిటి నీవు చెప్పింది”

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్”

“ఇది ఏ వేదములందూ మేం వినలేదు”

“అవకాశం లేదు. . . . ఎందుకంటే అది లాటిన్ భాష కాబట్టి.”

“ఆ భాషని మా ముందు వల్లించడంలో మీ వుద్దేశం.”

“సర్వజ్ఞులు మీకు తెలుయనిదేముంది” నిజాయితీగా అన్నాడు. మొహంలో సాధ్యమైనంత బాధని రంగరించుకుని.

“నేను ఆ జబ్బుతో బాధపడుతున్నాను”

దేవి ఉలికిపాటుగా చూసింది. “మీరు రోగగ్రస్తులా”

“హు” ఆర్ధ్రతగా అన్నాడు “శాపగ్రస్తుడ్ని మేడమ్. . .లేకపోతే ఈ వయసులో ఎంచక్కా మీలాంటి వాళ్ళ ఆఫర్‌ని కాదనడమేమిటి చెప్పండి - ఈ పాటికి వాత్స్యాయునిడి పుస్తకం పక్కన పెట్టుకుని మిమ్మల్ని ఓ ఆట ఆడించేవాడ్నిగా. . . కాని ఓ జబ్బు మూలంగా యీ అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాను”

ఆ శ్లోకం మననం చేసుకోబోయింది గాని విశ్వ చెప్పిన జబ్బు గుర్తుకు రాలేదు.

దేవి ఇబ్బందిని గుర్తించినట్టు మళ్ళీ తనే చెప్పాడు విశ్వ.

“జఘాతా కృషినా కఠోరలఫాకిట్ అనే ఈ జబ్బుని తెలుగులో ఏమంటారో నాకు తెలీదు. కాని లాటిన్ భాషలో దీనికి అర్థం ఘటాఫట్ లాడించే వయసులో కఠినమైన నిగ్రహంతో వ్యవహరించూ అని. . .ఇది నాకెలా వచ్చింది మరలా ఎంతకాలం వుంటుందీ అన్నవి మీ తర్వాత ప్రశ్నలనుకుంటాను”

సాధికారంగా తలపంకించి అంది [illegible] “అవును”

"ఓసారి పందెం కాసి చార్మినార్ మీద నుంచి దూకాను. . . అంతే జారిపోయింది"

"ఏమిటి" టక్కున అడిగింది.

"వెన్నుపూస. . . కొంతకాలం వీపులో వట్టి నొప్పిలే అని సరిపెట్టుకున్నాను. ఆ తర్వాత తెలిసింది నాలో మగాడికుండే సహజమైన స్పందన పోయిందని. . .చాలా మంది డాక్టర్లకు చూపించాను. . .చూపించిందేమిటి అని అడక్కండి. వాడుక భాషతో చూపించడమంటే జబ్బు లక్షణాల గురించి చెప్పడమేగా . . .ఆ ప్రోసెస్‌లో చాలా టెస్టుల తర్వాత తేలిందేమిటంటే యిదో అరుదైన జబ్బని - ఆ తర్వాత ఏడాదిగా మందులు వాడుతున్నాను.. ఇప్పుడు మొత్తం అంతా మామూలుగానే వుంది కాని మరో పదిరోజులు మందులు వాడాలి. అంతే. . అప్పుడు మీతోనే బోణీ ప్రారంభిస్తాను. . ." అబద్ధాల్ని ఆర్డర్‌లో అందంగా చెప్పిన విశ్వ దేవి అహాన్ని చల్లార్చేటట్టుగా మంచి భావుకతనీ ప్రయోగించాడు "ఇది హామీ యివ్వడం కాదు దేవీ. . . . సముద్రంలా పరుచుకున్న మీ శృంగార తనూలతని చూస్తూ దిక్కూచి పని చెయ్యని ఓడలా నిలబడిన నా దుర్విధికి బాధపడుతున్నాను. ఆకాశ ద్వారంలో అడుగుపెట్టమని పాలపుంత తోరణాలుకట్టి స్వాగతం చెప్పినా నక్షత్రాల్ని కోసి మీ సిగలో పెట్టాల్సిన నేను పువ్వులా కాక మొగ్గలా మిగిలినందుకు కుమిలిపోతున్నాను. . . . క్షణం సేపు స్వప్నంలోకి జారిన నేను పది రోజుల వ్యవధిలో మళ్ళీ మీ ముందుకు రావాలని వువ్విళ్ళూరుతున్నాను"

దేవి నేత్రాలు అరమోడ్పులయ్యాయి. . . . అర్జునుడి కోసం ఎదురు చూసిన నాగకన్య ఉలూచిలా బుసకొడుతూ అతడి మాటల తూణిరాలు మనసుని స్పందింప చేస్తుంటే భారంగా కనురెప్పల్ని మూసుకుంది.

"నేను చెప్పింది నిజమో కాదో దివ్య దృష్టితో పరికిస్తున్నట్టున్నారు" అన్నాడు మరింత ఆర్ద్రంగా.

"అవును" అంది కాని దేవి ఆ క్షణాన ఆలోచిస్తున్నది పదిరోజుల తర్వాత అతడితో సాగించబోయే ప్రణయపోరాటం గురించి. జీవితంలో తొలిసారి ఇలాంటి అనుభవం ఎదురైనందుకేమో ఓడిన బాధతో ఆ బాధపై సాధించాల్సిన గెలుపుకోసం సీరియస్‌గా ఆలోచిస్తుంది.

ఆశించింది జరిగిపోతే దాని ఆయుష్షు అయిదు నిమిషాలే కాని ఇప్పుడు జరగాల్సిందాని కోసం ఆశించడం, ఆశిస్తూ ఎదురు చూడడం వింతగా వుంది. విరహం ఆమెకు అర్థం కాని పదం.

"నీ కోసం ఎదురు చూస్తుంటాం" అంది తమకంగా.

ఆ తర్వాత ఆ రోజు సాయంకాలం కృషి మెషిన్ టూల్స్ జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు ఏకాంత సేవలో అందించిన టెండర్ జిరాక్స్ కాగితాన్ని విశ్వ కిచ్చింది. "ఎప్పుడో భార్యని హత్యచేసిన జనరల్ మేనేజరు సుబ్బారాయుడు దానిని ఆత్మహత్యగా

మారి అప్పుడప్పుడూ మాలో ఐక్యం కావాలని వస్తూంటాడు - చౌదరి కోరింది దృష్టిలో వుంచుకుని ఈ రోజు సుబ్బారాయుడి నుంచి యిది సంపాదించాం. జాగ్రత్తగా రాయుడికి అప్పజెప్పండి.

విశ్శు నిశ్చేష్టుడై చూశాడు ఆ కాపీలోకి. . .అందులో ఉపాధ్యాయగారు 'కోట్' చేసిన రేటుని తగ్గించి టెండరు పెడితే చాలా కోట్ల ఖరీదు చేసే ఆర్డరు మరొకరి సొత్తయిపోతుంది.

"పది రోజులలో రావాలి విశ్వనాథ్ - మిమ్మల్ని మాలో ఐక్యం చేసుకోవాలని మనసు ఉవ్విళ్ళూరుతూంది" బయటికి వెళ్తున్న విశ్శుతో మరోసారి ఓ షరతులా చెప్పింది.

0 0 0